

బాకర్‌సాహెబ్‌పేట రోడ్‌లో వరదనీరు

ఆదిత్యుని దర్శించుకున్న
హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహీన్ కుమార్‌కు ఆదిత్యుని చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో ప్రసాద్, అర్చకులు

అరసవల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహీన్ కుమార్ గేదెల దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఆలయ ఈవో ప్రసాద్ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఇప్పిలి షణ్ముఖశర్మ, నేతింటి హరిబాబు, ఇప్పిలి రంజిత్ శర్మ, రామకృష్ణ శర్మ, సాంబమూర్తి, వికాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుల్లో కొలువుల కోసం
దళారులను ఆశ్రయించవద్దు

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



శ్రీకాకుళం లీగల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో కొలువుల కోసం అభ్యర్థులు దళారులను ఆశ్రయించవద్దని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. సోమవారం ఆయన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లాలోని కోర్టుల్లో పలు ఉద్యోగాల ఎంపికకు ఈనెల 20 నుంచి 24 వరకు రాత పరీక్ష నిర్వహిస్తాం. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీకాకుళం, రాజాం, నరసన్నపేట కేంద్రాల్లో ఈ పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉంటుంది. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా దళారుల అవతారమెత్తితే నాకు ఫిర్యాదు చేయండి.' అని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాన్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, శాశ్వత లోక్‌అదాలత్ న్యాయాధికారి సువర్ణరాజు పాల్గొన్నారు.

రెడ్ అలర్ట్



పెదపాడు వద్ద చెరువును తలపిస్తున్న పంటపొలాలు



పాత్రునివలస ఫ్లైఓవర్ వద్ద..



ఆర్టీసీ కాంప్లెక్స్ లోపలకు ప్రవేశించిన వరదనీరు



జలదిగ్బంధంలో విశాఖ ఏ కాలనీ



పీఎస్‌ఎన్‌ఎం స్కూల్ రోడ్డు పై వరద

- ఇచ్ఛాపురం-గోపాలపూర్ మధ్య తీరం దాటనున్న తుఫాన్
- దీని ప్రభావంతో జిల్లాలో నేడు అతి భారీ వర్షాలు
- వాతావరణశాఖ హెచ్చరిక ● పాఠశాలలకు సెలవు
- మూడు రోజులుగా దంచికొడుతున్న వానలు
- ఉప్పొంగుతున్న నదులు ● నీటమునిగిన పంట పొలాలు, రోడ్లు
- శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయం ● కేంద్రమంత్రి రామ్మోహన్ ఆరా

శ్రీకాకుళం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌ను ప్రకటించింది. మంగళవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్యలో ఇచ్ఛాపురం-గోపాల్‌పూర్(ఒడిశా) మధ్యలో తుఫాన్ తీరం దాటనుందని స్పష్టం చేసింది. ఈ ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని, ఈదురుగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించింది. 20 సెం.మీ. పైబడి అసాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో మంగళవారం అన్ని ప్రభుత్వ, పాఠశాలలకు కలెక్టర్ సెలవును ప్రకటించారు. కాగా, జిల్లాలో మూడురోజుల నుంచి వానలు దంచికొడుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కుండపోతగా వర్షం కురిసింది. టెక్కలి, శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల, పలాస, నరసన్నపేట నియోజకవర్గాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. వర్షపునీటితో చెరువుల్లా మారిపోయాయి. రోడ్లు సైతం ముంపునకు గురయ్యాయి. శ్రీకాకుళం నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ పూర్తిస్థాయిలో జలమయమైంది. కాంప్లెక్స్ బయట.. లోపల, టిక్కెట్ల కౌంటర్‌లోకి కూడా వర్షపునీరు చేరింది. దీంతో (మిగతా 6వ పేజీలో..)

సోమవారం వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ)
నందిగాం	97.75
సంతబొమ్మాళి	72.0
ఆమదాలవలస	62.25
టెక్కలి	60.0
పలాస	52.75
పోలాకి	50.75
శ్రీకాకుళం	50.0
పాతపట్నం	46.5
మందస	37.25
బూర్జ	32.5
ఎల్.ఎన్.పేట	32.5
వజ్రపుకొత్తూరు	28.0
సారవకోట	25.5
నరసన్నపేట	24.5
ఎచ్చెర్ల	15.5
జలుమూరు	15.5
లావేరు	14.25
రణస్థలం	11.75
మెళియాపుట్టి	10.0
ఇచ్ఛాపురం	8.75

కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం
● ఆమదాలవలస ఎమ్మెల్యేపై ఆరోపణలు 8లో

ఐటీడీఏ పీవోను కొనసాగించవద్దు
● గిరిజన ఐక్యవేదిక నాయకుల ఆందోళన 8లో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
● కంట్రోల్ రూమ్‌తో నిరంతరం సంబంధాలు కొనసాగించాలి
● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ 6లో

విచారణ నివేదికను బహిర్గతం చేయండి
8లో



గార మండలం బందరువానిపేట వద్ద సముద్రంలోకి వేటకు వెళ్తున్న మత్స్యకారుడు (ఫైల్)

చిత్రం.. ఓ జ్ఞాపకం

● సాంకేతికత వచ్చినా క్రేజ్ తగ్గని వైనం
● నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

కరిగిపోయే కాలంలో చెరిగిపోని మధుర జ్ఞాపకాలకు ప్రతిబింబాలే ఫొటోలు. ప్రతి ఫొటో వెనుక ఎన్నో తీపిగుర్తులు. వంద భావాలను కూడా ఒక్క చిత్రంతో చెప్పొచ్చు. అందుకే నేటి డిటిజల్ యుగంలోనూ ఫొటోగ్రఫీ జోరు కొనసాగుతోంది. దాని క్రేజ్ ఏ మాత్రం తగ్గడం లేదు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగిన తర్వాత ప్రతిఒక్కరూ ఫొటోలు, సెల్ఫీలు తీయడంపై ఆసక్తి చూపుతున్నారు. నేడు చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ క్లిక్‌మని పిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం తమ మధుర స్మృతులను ఫొటోల రూపంలో భద్రపరుస్తున్నారు. వాటిని మళ్లీ మళ్లీ వీక్షించి తనివితీరా ఆనందం పొందుతున్నారు. ఎన్నో అనుభూతులను పంచే ఫొటోలు ప్రతిఒక్కరి జీవితంలోనూ ఎంతో ప్రత్యేకం.

మరిన్ని చిత్రాలు 6లో..



బార్‌ల ఏర్పాటుకు
దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 17 బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '2025-28 నూతన బార్ పాలసీ విధానంలో అనేక సంస్కరణలు చేశాం. శ్రీకాకుళం నగరంలో 11, పలాస కాశీబుగ్గలో 2, ఆమదాలవలసలో 2, ఇచ్ఛాపురంలో 2 బార్లకు సంబంధించి ఈ నెల 26 సాయంత్రం వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. 28న సాయంత్రం శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ తీసి బార్లను కేటాయిస్తాం. ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా, ఎన్ని దరఖాస్తులైనా సమర్పించుకోవచ్చు. ఒక బారుకు కనీసం నాలుగు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. గతంలో బార్ లైసెన్స్ రుసుం ఒకే వాయిదాలో ముందుగానే చెల్లించాల్సి ఉండేది. ఇప్పుడు ఒక బ్యాంకు గ్యారెంటీతో ఆరు సమాన వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించాం. లైసెన్స్ పొందిన 15 రోజుల్లోపు బార్లలో రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. కొత్త పాలసీ విధానం ద్వారా ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు బార్లు తెరిచి ఉంచుకోవచ్చు.' అని తెలిపారు.

ఏప్రిల్ నుంచి
వేతనాల్లేవు
● గ్రీవెన్స్‌లో రిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన 7లో

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మీకోసం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి 78 వినతులను స్వీకరించారు. సమస్యలు తక్షణ పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

పెద్ద పరీక్షే!

- నూతన విధానంలో విద్యార్థులకు పరీక్షలు
- తెల్లపేపర్లకు బదులు బుక్‌లెట్‌లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- రాసేందుకు తంటాలు పడుతున్న విద్యార్థులు
- భద్రపరచడంలో ఉపాధ్యాయులకు కష్టాలు



పాతపట్నం ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

పాతపట్నం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలు తీసుకొస్తుంది. ఇందులో భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి వివిధ మార్పులకు శ్రీకారం చుట్టింది. పేపర్లకు బదులు బుక్‌లెట్ విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే, ఈ విధానంలో పరీక్షలు రాసేందుకు ఇటు విద్యార్థులు, వాటి నిర్వహణకు అటు ఉపాధ్యాయులు తంటాలు పడుతున్నారు. గతంలో 1 నుంచి 10వ తరగతి వరకు యూనిట్ టెస్టులు, క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లీ, ఫైనల్ పరీక్షలు జరిగేవి. ఉపాధ్యాయులు విద్యార్థులకు తెల్లపేపర్లు ఇచ్చి వాటిపై పరీక్షలు రాయించేవారు. ఆ పేపర్లకు మూల్యాంకనం చేసి మార్కులు చెప్పేవారు. అయితే, ఈ విద్యాసంవత్సరం పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. ప్రతీవిద్యార్థి నాలుగు ఫార్మేటివ్ (నిర్మాణాత్మక), రెండు సమ్మేటివ్ (సంగ్రహణాత్మక) పరీక్షలు రాయాల్సి (మిగతా 6వ పేజీలో..)



ఎడతెరిపిలేని వర్షం

● పొర్లి ప్రవహించిన గెడ్డలు ● చెరువుల్లా మారిన పొలాలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు జోరువాన కురిసింది. దీంతో గెడ్డలు, వాగులు పొర్లి ప్రవహించాయి. పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు వాటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల గ్రామాల్లోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



నరసన్నపేట వీధుల్లో చేరిన వర్షపునీరు

తంపర భూముల్లోకి నీరు

నరసన్నపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నరసన్నపేట మండలంలో గల తంపర భూముల్లో నీరు చేరుతోంది. బాలసీమ, బసివలస, కంబకాయి, మామిడివలస, సుందరాపురం, పారశెల్లి, రెల్లివలస, ముద్దాడపేట, చోడవరం తదితర గ్రామాల్లో గల భూముల్లో వరదనీరు చేరుతుంది.

పలాసలో...



పద్మనాభపురం రోడ్డులో ప్రవహిస్తున్న వరదనీరు

పలాస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో రోజంతా వర్షం కురిసింది. పంటలు పండవు అనుకున్న తరుణంలో వర్షాలు కురవడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. జంట పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

కాశీబుగ్గలో..



కాశీబుగ్గ రైల్వేగేట్ సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు

కాశీబుగ్గ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గలో సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు భారీగా వర్షం కురిసింది. మెయిన్ రోడ్డులో కాలువలు నిండి..మురుగు నీరు రోడ్డుపై ప్రవహించింది. రహదారులు చెరువులను తలపించాయి. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

వంశధారకు నీటి ప్రవాహం

హిరమండలం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వంశధార నదిలో వరదనీరు చేరుతోంది. దీంతో గొట్టాబ్యారేజి వద్దకు 1037 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. సోమవారం సాయంత్రానికి బ్యారేజి 13 గేట్లు 20 సెంటీమీటర్లుపైకెత్తి 9,345 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,012 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. కుడి ప్రధాన కాలువ గేట్లు మూసివేశారు.

చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

కొత్తూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం పాలకొండ-హడ్డుబంగి ప్రధాన రహదారిలో నివగాం వద్ద వరదనీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఇదే రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించారు. వరదనీటి ప్రవాహానికి తగిన మార్గం లేనందున వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. అధికారులు స్పందించి వరద నీటిని మళ్లించేలా చర్యలు తీసుకోవాలని వాహన దారులు, ప్రజలు కోరుతున్నారు.

నివగాం వద్ద రోడ్డుపై వరదనీరు →



రాకపోకలు బంద్



మునిగిన కాజ్‌వే వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

పాతపట్నం/రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా విస్తారంగా పడుతున్న వర్షాలతో మహేంద్రతనయలో నీటి ప్రవాహం పెరిగింది. పాతపట్నంలోని కాజ్‌వేపై నీరు ప్రవహిస్తోంది. దీంతో నదికి అవతలి వైపు ఉన్న గోపాలపురం, కాపుగోపాలపురం, హరిజనగోపాలపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరదల పరిస్థితిని అధికారులు పరిశీలించారు.

ఇళ్ల నుంచి బయటకురాని ప్రజలు

కోటబొమ్మాళి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేని వర్షాలతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. పంట పొలాలు కొంత తేరుకుంటున్నాయి. చీపుర్లపాడు పంచాయతీ దుర్గంపేట గ్రామంలో వర్షం నీరు ఇళ్ల ముందు నిలిచిపోయింది. పాఠశాల చుట్టూ వర్షం నీరు చేరడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

కోటబొమ్మాళి: దుర్గంపేట వీధిలో ప్రవహిస్తున్న వర్షపునీరు →



చెరువుల్లోనూ.. పొలాల్లోనూ..

గార రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు చెరువుల్లో చేరి నిండుకుండలను తలపిస్తున్నాయి. పొలాల్లో చేరి పంటలు నీట మునిగాయి. కొన్నాళ్లగా వర్షాలు లేక కాలువల నీరు రాక ఇబ్బంది పడుతున్న సమయంలో ఈ వర్షాలు కొంత మేర పంటలకు ఉపయోగకరంగా ఉంటాయని రైతులు పేర్కొంటున్నారు.



గార రూరల్: పంట పొలాల్లో చేరిన నీరు

కడపలగెడ్డపై వరదనీరు

ఎల్ఎన్ పేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎల్ఎన్‌పేట మండలం కడపలగెడ్డ పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో గెడ్డపైన వేసిన తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దబ్బపాడు, తురకపేట గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి వరద ఉధృతి తగ్గిన తరువాత రాకపోకలు సాగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారి →



నందిగాంలో...

నందిగాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఎడతెరిపి లేని వర్షం పడింది. ఉయ్యాలపేట రహదారి చెరువుని తలపించింది. దీంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. నందిగాం ఎంఆర్‌సీ భవనం తడిసి ముద్దవడంతో కార్యాలయంలో ఉన్న ఇన్‌స్టారోటర్లు తడిసిపోయాయి. బెజ్జిపల్లి, బడబంద, స్వామిపేట, సుబ్బమ్మపేట, వల్లభరాయుడుపాడు రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. కవిటిఅగ్రహారం పెద్దవీధిలో వర్షపునీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. దుక్క పార్వతితో పాటు మరో ఐదు ఇళ్లలోకి నీరుచేరింది.



కవిటిఅగ్రహారం పెద్దవీధిలో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు

వర్షపు నీటిలో పంట పొలాలు

సరుబుజ్జిలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు పొలాల్లోకి చేరి ముంపునకు గురయ్యాయి. ఇసుకలపాలెం, గుడివలస, తుర కపేట, మూలసవలాపురం, సుబ్బపేట, పెద్ద సవలాపురం, సిం ధువాడ, వీరమల్లిపేట గ్రామాలకు చెందిన తంపర భూములు పూర్తిస్థాయిలో నీటమునిగాయి. సుమారు 75 ఎకరాల పంట పొలాలు నీటిలో మునిగినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



సరుబుజ్జిలి: తురకపేట వద్ద నదిని తలపిస్తున్న తంపర పంట పొలాలు

పొలాల ముంపు

గార, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల చాలా గ్రామాల్లో ఖరీఫ్ వరి పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు నీరు లేక పొలాల్లో వరి ఎదలు, వరినాట్లు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయం కాగా పొలాలు చెరువుల్లా కనిపిస్తున్నాయి.



తోణంగిలో పంటపొలాల్లో చేరిన వర్షపునీరు

గోకర్ణపురానికి వరద కష్టాలు

మెళియాపుట్టి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోకర్ణపురం గ్రామానికి మళ్లీ ముంపు కష్టాలు మొదలయ్యాయి. రాధాసాగరం పొంగి ప్రవహిస్తుడడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎవరికి ఏ చిన్న అవసరమైనా గొప్పిలి గ్రామానికి వెళ్లి నిత్యవసర సరుకులు తీసుకురావలసి ఉంటుంది. వంతెన నీట మునగడంతో ఊరు దాటలేని పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి.. వంతెన ముంపు బారి నుంచి తప్పించాలని సర్పంచ్ శనపతి రవికుమార్ కోరారు.

నీటితో ముంపునకు గురైన వంతెన →



ముందుకు వచ్చిన సముద్రం

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొబ్బరి, పనస. మునగ పంటలకు ఈ వర్షాలు ఎంతో అనుకూలమని ఉద్దానం, పల్లపు ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో సముద్రపు అలలు ఎగసి పడుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

శివసాగర్ బీచ్‌లో అలలు →



పెద్ద పరీక్షే!

(ఐదో పేజీ తరువాయి)

ఉంటుంది. దీనికోసం బుక్‌లెట్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పరీక్షలన్నీ ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. సమాధానాలన్నీ అదే బుక్‌లెట్‌లో ఉంటాయి. తరగతుల వారీగా ఒక్కో విద్యార్థికి ఒక్కో బుక్‌లెట్ రూపంలో అసెస్‌మెంట్ ఆన్సర్ షీటు ఉంటుంది. రిఫ్లక్షన్(ప్రతిస్పందన)- 5మార్కులు, హోమ్‌వర్క్ (రాతఅంశాలు)కు -5మార్కులు, ప్రాజెక్ట్ వర్క్‌కు 5మార్కులు, రాతపరీక్షకు 35మార్కులు కేటాయించారు. పరీక్ష రాయడానికి గంట సమయమిచ్చారు.

సరిపోని సమయం..

బుక్‌లెట్ ఓఎంఆర్ షీట్‌లో ఇచ్చిన నిబంధనల మేరకు పరీక్షలు రాయడానికి ఇచ్చే గంట సమయం విద్యార్థులకు సరిపోదని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎఫ్ఏ-1 పరీక్షల నిర్వాహణకు ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పరీక్షలు మొదలు కాగానే బుక్‌లెట్ అందుకున్న విద్యార్థి అందులో తన పేరు, క్లాస్, సెక్షన్, రోల్ నెంబర్, స్కూల్ నేమ్, పెన్ఐడీ, యు డైస్‌కోడ్ రాయాలి. ప్రశ్నాపత్రంలో మల్టిబుల్ చాయిస్ టిక్ పెట్టుకొని బుక్‌లెట్‌లో జవాబులు రాసే ప్రక్రియ మొదలుపెట్టాలి. ఓఎంఆర్ షీట్‌లో పెన్ఐడీ ఎగ్జామ్‌కోడ్ రాసిన తరువాతనే బబ్లింగ్ చేయాలి. ఆ తరువాతనే విద్యార్థులు బుక్‌లెట్‌లో ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఈ తతాంగమంతా విద్యాశాఖ ఇచ్చిన నిబంధనల మేరకు ఓ గంటలో ముగించాలి. దీంతో అన్ని సమాధానాలు రాయలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● ఉపాధ్యాయులు మూల్యాంకనం వెంటనే జరిపి విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీట్‌తో పాటు బుక్‌లెట్, లీప్‌యాప్‌లో మార్కులు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈప్రక్రియంతా పాఠశాలలోనే చేపట్టాలి. గతంలో పరీక్షలు జరిగిన వెంటనే ఉపాధ్యాయులు జవాబు పత్రాలను తమ ఇళ్లకు తీసుకువెళ్లి, మూల్యాంకనం చేసి మార్కులను యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. ఇప్పుడు కొత్తవిధానంతో ఉపాధ్యాయులు హడలెత్తుతున్నారు.



బుక్‌లెట్‌లు భద్రపరచడం కష్టం

మూల్యాంకన ప్రక్రియ పూర్తయిన తరువాత బుక్‌లెట్‌లను భద్రపరచడం కష్టం అవుతుంది. కొత్త విధానమైతే బాగుంది గానీ, మరికొన్ని మార్పులు తీసుకురావాల్సి ఉంది.

- ఎస్.వైకుంఠరావు, హెచ్ఎం, ప్రభుత్వ ఉన్నతపాఠశాల, పాతపట్నం

ప్రయోజనకరం



బుక్‌లెట్‌లో విద్యార్థి పూర్తి చరిత్ర ఉంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన విధానం దీర్ఘకాలంలో ప్రయోజనకరంగా ఉంటుంది. విద్యార్థుల విద్యా ప్రమాణాలు అభివృద్ధి పరిచేందుకు వీలుంటుంది.

- సీహెచ్ తిరుమలరావు, ఎంఈవో-1

చెరిగిపోని.. చిత్రం!



నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఫొటోలను ఎంతో కీలకంగా భావిస్తారు. పది కాలాల పాటు ఫొటోలను చాలామంది జాగ్రత్తగా భద్రపరచుకుంటారు. ఆ చిత్రాలను చూసి.. జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందపడతారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అరుదైన ఫొటోలు చూద్దామా..



ఆ నలుగురు..

అప్పటి ప్రధాని వాజ్‌పేయ్... లోక్‌సభ స్పీకర్ బాలయోగి, కేంద్ర మంత్రి హోదాలో కింజరాపు ఎర్రన్నాయుడులు స్వాతంత్ర సమరయోధుడు, సర్దార్ గౌతు లచ్చన్నను ప్రత్యేకంగా పిలిపించుకొని అభినందించిన సమయంలో తీసిన చిత్రమిది.

ఇద్దరూ ఇద్దరే

పలాస/సోంపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కింజరాపు ఎర్రన్నాయుడు, గౌతు శ్యామసుందర శివాజీల పేర్లు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. వీరిద్దరూ మంచి స్నేహితులు. వ్యక్తిగతంగా.. రాజకీయంగా అనేక నిర్ణయాలను ఇద్దరూ కలిసే తీసుకునేవారు. కలిసే నడిచేవారు. అప్పటి తెలుగుదేశం అధినేత ఎన్టీఆర్ హయాంలో వీరిద్దరికీ అసెంబ్లీ టిక్కెట్లు నిరాకరించడంతో సోంపేట, హరిశ్చంద్రపురం అసెంబ్లీ స్థానాలకు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఇద్దరూ పోటీ చేసి గెలుపొందారు. ఆ సందర్భంగా సోంపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో తీసిన చిత్రమిది.



పురస్కారం అందుకున్న వేళ..

1999లో కేంద్రంలో వాజ్‌పేయ్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరింది. అప్పట్లో తెలుగుదేశం పార్టీ ఎన్డీఏలో కీలక భాగస్వామి. టీడీపీకి చెందిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా ఉండేవారు. కేంద్ర మంత్రిగా ఎర్రన్నాయుడు కీలక బాధ్యతలు చేపట్టేవారు. అటువంటి సమయంలో కేంద్రం నుంచి పురస్కారం అందుకున్నారు. ఆ సమయంలో తీసిన చిత్రమే ఇది.

సర్దారు జ్ఞాపకం..

కాశీబుగ్గ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సర్దార్ గౌతు లచ్చన్న తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, అంతకు ముందు జమిందారీ వ్యవస్థపై పోరాడిన నాయకుడు. బీసీలకు రాజ్యాధికారంతో పాటు రిజర్వేషన్ల కోసం పోరాడిన యోధుడు. 1952లో ప్రకాశం పంతులు మంత్రి వర్గంలో, 1955-56లో బెజవాడ గోపాల్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. అప్పట్లో కర్నూలు రాజధాని కావడంతో భార్య యశోదా దేవి, కుమారుడు గౌతు శివాజీ, ఇద్దరు కుమార్తెలతో లచ్చన్న దిగిన ఫొటో ఇది.



విధుల్లో చేరిన తొలినాళ్లలో..

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద 1991లో ఎస్ఐగా ఎంపికయ్యారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి సోదరుడు కింజరాపు ప్రభాకరరావు కూడా తన బ్యాచ్‌మేట్ అని చెప్పారు. శిక్షణ సమయంలో తన సహచరులతో తీసుకున్న చిత్రాన్ని భద్రంగా ఉంచానని చెప్పారు.



శిక్షణ సమయంలో సహచర సబ్ ఇన్‌స్పెక్టర్లతో డీఎస్పీ వివేకానంద

కుండపోత..

(ఐదో పేజీ తరువాయి)

ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణి కులు అవస్థలు పడ్డారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. కాంప్లెక్స్ ముందున్న కాలువలు, దుకాణాలు, పార్కిం గ్ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల నుంచి నీటిని నాగావళి, వంశధార నదుల్లోకి విడిచి పెడుతున్నారు. దీంతో ఈ రెండు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా నాగావళి నదీ ఉధృతి మరింత పెరిగే అవకాశముందని నీటిపా రుదల శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచే అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండా లని, నదులు, చెరువుల పరివాహక ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికారులు, ప్రత్యేక బలగాలు. సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భారీవర్షాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. ఢిల్లీలో ఉన్న ఆయన ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. ప్రతి ఆరు గంటలకు ఒక సారి తనకు నివేదికలు పంపాలని ఆదేశించారు. తీరప్రాంత గ్రామాల ప్రజల ను అప్రమత్తం చేయాలని, లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశా లకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్స్యకా రులు సముద్ర వేటకు వెళ్లకుండా చూడాలని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో సమీక్షించారు. ఆర్ అండ్‌బీ, విపత్తుల నిర్వహణ, విద్యుత్తు, రెవెన్యూ తదితర శాఖలన్నీ పూర్తి అప్రమత్తంగా ఉండి, కం ట్రోల్ రూమ్‌తో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు అల్పపీడన ప్రభావం ఉంటుందని అన్నారు. వర్షంతో పాటు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవ కాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

అరసవల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విశాఖ వెళ్లేందుకు 17వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద సాధు సరోజిని వేచి ఉండి.. బస్సు రాగానే హడావుడిగా తన పర్సును అక్కడే వదిలి బస్సు ఎక్కారు. ఈ పర్సు కాంతారావు అనే వ్యక్తికి దొరికింది. దీంతో సదరు వ్యక్తి డిపో మేనేజర్‌కి అందజేశాడు. అనంతరం సరోజిని తన పర్సును శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో పోగొట్టుకున్నట్లు గుర్తించి శ్రీకాకుళం డిపోకు ఫోన్ చేశారు. విచారణ అనంతరం డిపో మేనేజర్ అమరసింహుడు, ఎస్ఎం ప్రసాద్, సెక్యూరిటీ కానిస్టేబుల్ జోగారావు సమక్షంలో ఆమెకు పర్సును అందజేశారు. పర్సులో తులం బంగారు గొలుసు, రూ.1700 నగదు ఉంది.

ఏప్రిల్ నుంచి వేతనాల్లేవు

● గ్రీవెన్స్‌లో రిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన


గ్రీవెన్స్‌కు వచ్చిన రిమ్స్ సెక్యూరిటీ గార్డులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, అయితే ఏప్రిల్ నుంచి వేతనాలు చెల్లించలేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలిసి సమస్యను విన్నవించారు. కాంట్రాక్టర్ మారిన ప్రతిసారి నెలల తరబడి వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కుటుంబాలను పోషించు కునేందుకు ఇక్క ట్లకు గురికావాల్సి వస్తోందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. పాత కాంట్రాక్టర్ ఏప్రిల్, మే, కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ కూడా జూన్, జూలై వేతనాలు ఇంతవరకు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

నా ఇంటికి సరైన ధర ఇవ్వండి


దుర్గాశి చిట్టయ్య

తాను 15 ఏళ్లుగా దేశ సరిహద్దులో సైనికుడిగా సేవ లందిస్తున్నానని, తన కష్టార్జితంతో స్వగ్రామంలో కట్టుకున్న ఇంటికి పోర్టు అధికారులు తక్కువ ఎస్టి మేషన్ వేశారని, తనకు న్యాయం చేయాలని సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన దుర్గాశి చిట్టయ్య వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తాను ఇంటిని రూ.50 లక్షలతో నిర్మించుకున్నానని, అయితే మూలపేట పోర్టు నిర్మాణంలో తన ఇల్లు కోల్పోతున్నానని, దీనికి అధి కారులు రూ.24 లక్షలే ఎస్టిమేషన్ వేశారని, కనీసం ఎస్టిమేషన్ కాపీ కూడా ఇవ్వడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తన ఇంటికి సరైన ధర ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

పింఛన్ ఆగిపోయింది.. బతికేదెలా?



తాను ఏ పనీ చేయలేని నిస్సహాయుడినని. తనకు వచ్చిన దివ్యాంగ పింఛన్ నిలిపివేశారని, న్యాయం చేసి పింఛన్ పునరుద్ధరించాలని సారవకోట మండలం గొర్రిబంద గ్రామానికి చెందిన రావాడ నవీన్ కోరాడు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించాడు. హఠాత్తుగా నా పింఛనును రద్దు చేస్తున్నట్లు నోటీసిచ్చారు. దాంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. రీ వెరిఫికేషన్‌లో నా పేరు లేదంటూ చెప్పారు. నేను ఏం తప్పు చేశానని ఇలా జరిగిందో తెలియడం లేదు. పింఛన్ వచ్చేలా సాయం చేయాలని వేడుకున్నాడు.

పీఏసీఎస్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

ఎచ్చెర్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎస్ఎంపురం పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఎచ్చెర్లలోని కార్యాలయంలో కోఆపరేటివ్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.జానకి రామయ్య, సీఈవో కె.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పీఏసీఎస్ అధ్యక్షుడిగా చౌదరి అవినాష్, డైరెక్టర్లుగా ముద్దాడ వెంకట రమణ, పుణ్యపు శంకరరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు రుణాలందజేసేందుకు కృషి చేస్తామన్నారు. డ్రోన్‌లను కొనుగోలు చేసి రైతులకు అద్దెకి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పీఏసీఎస్ తరఫున మండలంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఏర్పాటుకు తీర్మానించారు. పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులను టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి తదితరులు అభినందించారు.

జి.సిగడాం, బాతువ పీఏసీఎస్‌ల్లోనూ..

జి.సిగడాం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో జి.సిగడాం, బాతువ పీఏసీఎస్ పాలకవర్గాలు సోమవారం బాధ్యతలు స్వీకరించాయి. జి.సిగడాం పీఏసీఎస్ చైర్మన్ బెవర జగన్నాథరావు, డైరెక్టర్‌లు పడాల అప్పన్న మాస్టారు, విక్రం కామేశ్వరరావు, అలాగే బాతువ పీఏసీఎస్ చైర్మన్ నక్క మురళీధరరావు సంతకాలు చేసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు కుమరాపు రవి కుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, బాలబొమ్మ వేంకటేశ్వరరావు, టంకాల మౌళీశ్వరరావు, సర్పంచ్‌లు మహాదాశ్యం చిన్నారావు, బోగాది అప్పలనాయుడు, సీఈవోలు ఎ.పాపినాయుడు, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

చెరువు గట్టుకు రక్షణ



చెరువు గట్టుకు రక్షణ కల్పిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలసవలాపురం, కామి నాయుడు చెరువు గట్టు వర్షాలకు కోరుకుపోవడంతో గండిపడే అవకాశం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వర్షాలకు కోరుకుపోయిన చెరువుగట్టు' శీర్షికతో వచ్చిన కథనానికి వంశధార అధికారులు స్పందించారు. వంశధార ఏఈ కాజావుద్దీన్ సిబ్బంది సదరు ప్రాంతాన్ని పరిశీలించి గట్టును పటిష్టం చేశారు. సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు సహకారంతో గండి పడకుండా బస్తాలు వేసి గట్టుకు రక్షణ చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తంచేశారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

సరుబుజ్జిలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సరుబుజ్జిలి నాలుగు రోడ్ల జంక్షన్‌లో సోమవారం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. అలికాం-బత్తిలి, పాలకొండ-కొమనాపల్లి నాలుగు వైపులా రోడ్లకు కూడలిగా ఉన్న ఈ ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే కూన రవి కుమార్ రోడ్డు విస్తరణకు సుమారు రూ.12 కోట్లు మంజూరు చేయించారు. ప్రధాన రహదారి ఏబీ రోడ్డు సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి పెట్రోల్ బంకు వరకు 1500 మీటర్లు, పాలకొండ కొమనాపల్లి మార్గంలో 400 మీటర్లు మేర నాలుగు రోడ్లుగా విస్తరించేందుకు ఆర్ అండ్‌బీ జేఈ అంజనేయులు నాయక్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ, సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి పర్యవే క్షణలో భవన సము దాయాలను యంత్రాలతో తొలగించారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీ



రణస్థలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పలు దుకాణాలను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మాదక ద్రవ్యాల విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

ఆమదాలవలస, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాజకీయ జీవితంలో ఎటువంటి మచ్చలేని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌పై ఉద్దేశపూర్వకంగానే కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆరోపణలు చేస్తున్నారని, విచారణ చేసి ఆమెపై చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా కాళింగ సంక్షేమ సంఘం, మానవహక్కు సంఘం అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పేడాడ జనార్దనరావు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సదరు ప్రిన్సిపాల్ సౌమ్య చరిత్ర అంతా తప్పుడు కేసులతో ఉందని, బదిలీని జీర్ణించుకోలేక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. దళిత సంఘాలు కూడా నిజాలు తెలుసుకోకుండా ఆమెను వెనకేసుకురావడం సరికాదన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్


ఎచ్చెర్ల: తమ్మినాయుడుపేట వద్ద నాగావళి నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్

ఎచ్చెర్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష సూచించారు. తమ్మినాయుడుపేట వద్ద నాగావళి నది నీటి ప్రవాహాన్ని సోమవారం పరిశీలించారు. నీటి ఉధృతి పెరిగితే అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. వారితో పాటు తహసీల్దార్ బి.గోపాల్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మత్స్యకారులూ.. వేటకు వెళ్లొద్దు

సోంపేట రూరల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సముద్ర తీర గ్రామాల్లోని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, పలాస ఆర్డీవో వెంకటేష్ కోరారు. సోమవారం సాయంత్రం ఉప్పలాం, గొల్లవూరు పంచాయతీ పరిధిలోని నడుమూరు, ఎకువూరు, గొల్లవూరు గ్రామాలను సందర్శించి మత్స్యకారులను అప్రమత్తం చేశారు. అవసరమైతే నడుమూరు హైస్కూల్, గొల్లవూరు తుఫాన్ రక్షిత భవనాలకు ప్రజలను తరలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబునాయుడు, తహసీల్దార్ బి.అప్పలస్వామి, మత్స్యకార నాయకులు బడే సూరి, బడే ఈశ్వరరావు, ఎం.పాపారావు, దుర్యోధన, రామారావు, మెరైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెల్లిగెడ్డ బ్రిడ్జి పైనుంచి రాకపోకల నియంత్రణ


బ్రిడ్జి వద్ద పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ, ఏఈ రాజు

పొందూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లైదాం సమీపంలోని రెల్లిగెడ్డ వంతెన వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం వరదనీరు కొద్దిగా వంతెన పైనుంచి ప్రవహిస్తుండడంతో రాకపోకలను నియంత్రిస్తున్నారు. సోమవారం ఆర్అండ్‌బీ ఏఈ పీటీ రాజు, ఎస్ఐ వి.సత్యనారాయణ బ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలించారు. పాదచారులు జాగ్రత్తలు తీసుకుని బ్రిడ్జి పైనుంచి తగిన రాకపోకలు సాగించేందుకు అనుమతిస్తున్నారు.

తుఫాన్ పట్ల జాగ్రత్తగా ఉండాలి: డ్వామా పీడీ


మాట్లాడుతున్న పీడీ సుధాకరరావు

ఇచ్ఛాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు ఆదేశించారు. సోమవారం రాత్రి ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మత్స్యకార గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం డొంకూరు సముద్ర తీరంలో మత్స్యకారులతో మాట్లాడి అప్రమత్తం చేశారు. ఎంపీడీవో రామారావు, డీటీ శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, హౌసింగ్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రణస్థలం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రణస్థలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ యోగేశ్వరరావు పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో జేఆర్‌పురం, జీఎంఆర్ కాలనీ, కొత్తపెట్రోల్ బంకు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

కిడ్నీ బాధితురాలికి సాయం

సోంపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాంకి చెందిన బైపల్లి రాజు భార్య సుజాత కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన దుద్ది శ్రీనివాసరావు స్పందించి మందులు ఖర్చుల కోసం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఒడియా విద్యా వలంటీర్ల జీతాలు విడుదల చేయాలి


స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఒడియా సంఘ నేతలు

కవిటి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఒడియా విద్యా వలంటీర్ల జీతాలు విడుదల చేయాలని ఒడిశా అసెంబ్లీ స్పీకర్ సురమ పాడిని కోరారు. ఈ మేరకు సోమవారం ఒడియా లింగ్విస్టిక్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ పాడి భువనేశ్వర్‌లోని స్పీకర్ ప్రభుత్వ నివాస కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒడియా భాషాభివృద్ధికి వివిధ ఒడిశా పాఠశాలల్లో ఒడి శా ప్రభుత్వం నియమించిన విద్యా వలంటీర్లకు గత విద్యా సంవత్సరం జీతాలు చెల్లించలేదని, తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి అవసరమైన విద్యా వలంటీర్ల నియామకానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఒడియా పాఠశాలల డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఇచ్ఛాపురం బాపూజీ పాఠాగర్ అధ్యక్షుడు రఘునాథ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజా రవాణా అధికారిగా అప్పలనారాయణ



అరసవల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణా అధికారిగా సీహెచ్ అప్పలనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో విధుల్లో చేరారు. ఈయన విజయనగరం జిల్లాలో డీపీటీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

జ్ఞాన ప్రవచన యజ్ఞం ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చిన్మయ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిద్భానంద సరస్వతి ఆధ్వర్యంలో సోమవారం జ్ఞాన ప్రవచన యజ్ఞం స్థానిక బాపూజీ కళామందిర్‌లో ప్రారంభించారు. 'మహాభారతం-శాంతి పర్వం'పై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు శాంతిగా ఉండాలని, ఎటువంటి కష్టాలు వచ్చినా సమస్యను సులభతరంగా పరిశీలించేలా జీవితాన్ని సుసంపన్నం చేసుకోవాలన్నారు. మహాభారతంతో శ్రీకృష్ణుడు ఉపదేశించిన సందేశాలు వింటే జీవితం గమ్యం ఏంటో తెలుస్తుందన్నారు. ఈనెల 23 వరకు ఈ ప్రసంగాలు ఉంటాయని నిర్వాహకులు స్వామి పరమాత్మానంద తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిష్టల నరసింహమూర్తి, చాగంటి బాపయ్య, రామకృష్ణ, విశ్వేశ్వరరావు, మందుల మోహన్‌రావు, బి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదానం శిబిరం

కంచిలి/కవిటి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచ 186వ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉద్దానం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. కంచిలి మార్కెట్ యార్డ్ వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో నియోజక వర్గంలోని ఫొటోగ్రాఫర్స్ సంఘ ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

వీవోఏను తొలగించండి

సోంపేట రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామైక్య సంఘాల సహాయకురాలిగా (వీవోఏ) పనిచేస్తున్న కొల్లి జయలక్ష్మిని తొలగించాలని పలు గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు కోరారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో ఎంపీడీవో ఈశ్వరమ్మకు ఫిర్యాదు చేశారు. వీవోఏ పనితీరు, ప్రవర్తనతో ఇబ్బందులు ఎదురవు తున్నా యని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజాం, పాతిన వలస పాత్రపురం గ్రామాలకు చెందిన మహిళలు వినతిపత్రం అందించారు.

హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం


జస్టిస్ తుహిన్‌కుమార్‌కు మొక్కను అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, చిత్రంలో జిల్లా న్యాయాధికారి మౌలానా

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్ సోమవారం జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా పోలీసు అతిథి గృహంలో జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్పీ మహేశ్వరరెడ్డి స్వాగతం పలికారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి అభినందించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా త్వరితగతి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో 47 మంది నుంచి వినతులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వీటిపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడుతూ.. త్వరితగతిన చట్టపరంగా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

ఆదిత్యాలయంలో టెండర్ల ప్రక్రియ

అరసవల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అరసవల్లి ఆదిత్యాలయంలో సిబ్బంది మెయింటెనెన్స్ నిమిత్తం ఔట్ సోర్సింగ్ సంస్థను ఖరారు చేసేందుకు సీల్డ్ టెండర్లను ఆహ్వానించారు. దీనికి సంబంధించి సోమవారం ఆలయ అనివెట్టి మండపంలో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఆరుగురు సీల్డ్ టెండరు వేయగా వీటిలో ఒకటి జీరో టెండర్ కూడా రావడంతో టెండరుదారులకు, ఆలయ అధికారులకు మధ్య వాదోపవాదాలు జరిగాయి. అయితే న్యాయసలహా తీసుకున్న తరువాత టెండర్ల ఖరారుకు వాటిని దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తామని, ఆయనదే తుది నిర్ణయమని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం

● ఆమదాలవలస ఎమ్మెల్యేపై ఆరోపణలు


ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సౌమ్య

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల నుంచి వార్తల్లో నిలిచిన పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రెజేటి సౌమ్య సోమవారం ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం నగరంలో తిలక్‌నగర్‌లో నివసిస్తున్న ఆమె సోమవారం ఉదయం ఓ సోషల్‌మీడియాతో మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. అదే సమయంలో ఇంటిలో సౌమ్య పడిపోవడంతో ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డా.శిరీష.. సౌమ్యను అత్యవసర చికిత్స విభాగంలో చేర్పించారు. మధ్యాహ్నానికి ఆమె పరిస్థితి కాస్త మెరుగుపడింది. అక్కడే తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపణలు చేశారని.. తనపై వస్తున్న నెగిటివ్ ట్రోల్స్ తట్టుకోలేక ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిపారు. తనను టార్గెట్ చేసి వేధిస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. ఆసుపత్రి ప్రాంగణంలోనే ఆమె కుమారుడు రాహుల్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పలువురు స్టూడెంట్లకు అడ్మిషన్లు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని, అయితే అప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ముగియడంతో నిబంధనలకు విరుద్ధంగా తన తల్లి అంగీకరించ లేదన్నారు. పొందూరు నుంచి కంచిలి మండలానికి బదిలీ చేశారని.. చాలా వేధింపులకు గురిచేయడంతో తన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

వ్యాన్ ఢీకొని యువకుడి దుర్మరణం


పవన్ కుమార్ (ఫైల్)

లావేరు/జలుమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): లావేరు మండలం తాళ్లవలస వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం గొటివాడ గ్రామానికి చెందిన ముత్తా పవన్ కుమార్ (25) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు వివరాలివీ... పవన్ కుమార్ విశాఖపట్నంలోని ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితులు, బంధువులతో మూడు రోజులు సరదాగా గడిపాడు. సోమవారం తిరిగి ద్విచక్ర వాహనంపై వైజాగ్ వెళుతుండగా తాళ్లవలస వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన వ్యాన్ ఢీకొంది. ఈ సంఘటనలో పవన్ కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం తెలుసుకున్న గొటివాడ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పవన్‌కుమార్‌కు తల్లిదండ్రులు ఉషారాణి, నర్సింగరావు, సోదరుడు సాయి ఉన్నారు. తండ్రి విశ్రాంత మిలిటరీ ఉద్యోగి. తల్లి గృహిణి. ఇంటి నుంచి బయలుదేరి గంట సమయం గడవక ముందే కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని వార్త తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తండ్రి నర్సింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు లావేరు ఎస్ఐ లక్ష్మణరావు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రణస్థలం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీతారాంపురం గ్రామానికి చెందిన ఎం.రమణ అనే వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. కుటుంబ కలహాలతో ఈనెల 15న రమణ చీమల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న రమణను వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖపట్నంలో రోడ్డు ప్రమాదం

● పలాస యువతి, మరో యువకుడు దుర్మరణం

కొమ్మాది (విశాఖపట్నం), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నగరం పి.ఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. పి.ఎం.పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జోడుగుళ్లపాలెంకు చెందిన వాసుపల్లి సతీష్ (19), శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన సంబాల ఉషారాణి స్నేహితులు. ఉషారాణి ఉద్యోగ అన్వేషణ నిమిత్తం పరదేశిపాలెంలో గదిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటోంది. సోమవారం సాయంత్రం సతీష్, ఉషారాణి ఇద్దరూ ద్విచక్రవాహనంపై పరదేశిపాలెం నుంచి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. జాతీయ రహదారి మధురవాడ బస్టాప్ వద్దకు చేరేసరికి లారీని అధిగమించబోయి దాని కింద పడిపోవటంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

రైతులకు అందని ఎరువులు

టెక్కలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా కావడం లేదని, పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలని కోరుతూ సోమవారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేడాడ తిలక్ నేతృత్వంలో కార్యకర్తలు ఆందోళన వెలిబుచ్చారు. అంబేద్కర్ కూడలి నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్తూ స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పోలీసులు రంగప్రవేశం చేసి.. శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలే తప్ప బైఠాయింపు సరికాదని తెలిపారు. దీంతో వైసీపీ నాయకులు సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా వెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో నడుపూరు శ్రీరామ్మూర్తి, సంపతిరావు రాజు, కిల్లి అజయ్, సత్తారు సత్యం, గురునాథ్ యాదవ్, బుడ్డా మోహన్‌రెడ్డి, పినకాన వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకరించండి

పలాస, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు సహకారం అందించాలని అభివృద్ధి కమిటీ డైరెక్టర్ దడియాల నర్సింహులు కోరారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు జయశంకర్ రోగులకు వినియోగించేందుకు వీల్‌చైర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆసుపత్రి సూపరింటెండెంట్ చిన్నంనాయుడు, అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ ఆసుపత్రికి ఉదారంగా పరికరాలు అందించాలని దాతలను కోరారు.

ఎం.తోటూరులో కార్డన్ సెర్చ్

ఇచ్ఛాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎం.తోటూరు గ్రామంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని 15 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. అపరిచితులకు ఇళ్లను అద్దెకు ఇవ్వవద్దన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను తీసు కొచ్చి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. ఈదుపురం గ్రామంలో సంకల్పంలో భాగంగా సోమవారం డ్రగ్స్‌ను నివారించాలని కోరుతూ యువతతో ర్యాలీ నిర్వహించారు.


కొండపై జలపాతం


పచ్చని కొండల మధ్య ఇలా...

జలపాతం.. ప్రకృతి సోయగం

పలాస రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పలాస మండలంలోని లొత్తూరు, తొసరాడ గ్రామీణ ప్రాంతాలు మహేంద్రగిరి కొండలను ఆనుకొని ఉంటాయి. పలాస మండలంలో చివరి గ్రామం తొసరాడ. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఈ గ్రామానికి సమీపంలోని కొండల పై నుంచి జాలువారుతున్న జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. అటు జలపాతం..ఇటు పచ్చని కొండలు... పొలాలతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటోంది. ఈ ప్రకృతి సోయగాలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

నరసన్నపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గత మే నెల నుంచి ఐగాట్ కర్మయోగి యాప్‌లో ఉన్న వీడియో పాఠాలు వీక్షించి తీరాలని ఉపాధ్యాయులపై అధికారులు ఒత్తిడి తీసుకురావడం సరికాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తిలు సోమవారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. మొదట్లో నాలుగు పాఠాలు వినాలని, మరలా 20 పాఠాలు వినాలని కలెక్టర్ కార్యాలయాల నుంచి వ్యక్తిగతంగా సందేశాలు పంపి ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇంత వరకు ఒక్క అధికారి కూడా ఐగాట్ కర్మయోగి అంటే ఏమిటి? ఎందుకు ఇందులో వీడియో పాఠాలు వినాలి? అనే దానిపై ఉపాధ్యాయులకు స్పష్టం చేయలేదన్నారు.

కేజీబీవీలో రక్త పరీక్షలు

పోలాకి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గంగివలస కస్తూర్బా గురుకుల విద్యాలయ బాలికలకు సోమవారం పోలాకి పీహెచ్‌సీ విస్తరణాధికారి నల్లి రవికుమార్, సిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ బి.శారద, శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, మోహిని, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలతో ప్రాణనష్టం లేకుండా చూడండి


వంశధార నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి అరుంధతీదేవి

జలుమూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా మండల స్థాయి అధికారులు గ్రామాల్లో ప్రజానీకాన్ని అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.అరుంధతీదేవి ఆదేశించారు. కొమనాపల్లి, సురవరం వద్ద వంశధార నదిలో వచ్చే వరద నీటి ప్రవాహాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వంశధార నదికి వరద ముప్పు ఉందని నదీ తీర గ్రామాల్లో ప్రజానీకానికి అప్రమత్తం చేయాలన్నారు. వంశధార నీటి ప్రవాహం పెరిగి నదీతీర గ్రామాల్లోకి వరదనీరు వెళ్లినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. రెవెన్యూ అధికారులు నదీ తీర గ్రామాల్లో ఉంటూ.. ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు చేరవేయాలన్నారు. వరదనీరు గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్న గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహసీల్దారుకు ఆదేశించారు. వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దారు జె.రామారావు, ఆర్.ఐ.కిరణ్, వీఆర్వో డి.గోపి పాల్గొన్నారు.

పల్లపు ప్రాంతాల పరిశీలన

పోలాకి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సాగరతీరంలోని పల్లపు ప్రాంతాలను తహసీల్దారు పి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు పొలాలు జలమయమయ్యాయి. దండులక్ష్మీపురం, సునరాం, సత్రవుపేట, కొత్తరేవు, పల్లిపేట, డోల గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి చిరంజీవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాలు జలమయమయ్యాయి.

అప్రమత్తంగా ఉండాలి

కొత్తూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో వంశధార నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ గ్రామాల్లో దండోరాలు వేయించామని తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు. సోమవారం మాతల వద్ద వంశధార నదీ ప్రవాహాన్ని పరిశీలించారు. గ్రామ స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఒడిశాతో పాటు జిల్లా అంతటా కురుస్తున్న వర్షాలకు వంశధార నదిలో వరద నీరు పెరిగే ప్రమాదం ఉన్నందున తీర గ్రామాల ప్రజలు తగిన జాగ్రత్తలతో ఉండాలని సూచించారు. సిరుసువాడ, కుంటిబద్ర, వసప, నివగాం, కడుము, హంస, పెనుగోటవాడ. మాతల, వీఎస్‌పురం, పోనుటూరు, మదనాపురం, సోమరాజపురం, అంగూరు, ఆకులతంపర గ్రామాల ప్రజలను ఇప్పటికే సచివాలయ సిబ్బంది అప్రమత్తం చేశారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, వంశధార నీటి మట్టం పెరిగితే తక్షణం అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఎల్ఎన్‌పేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎన్ఎన్‌పేట మండలంలో వంశధార నదీ తీర గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు జె.ఈశ్వరమ్మ తెలిపారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఆదేశించామని ఆమె తెలిపారు. ప్రజల సౌకర్యార్థం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని వివరించారు.

పూడిలంకకు ముప్పు లేదు

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారుల బృందం సోమవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. ముఖ్యంగా పూడిలంక గ్రామం వద్ద పరిస్థితి అదుపులో ఉందని తహసీల్దార్ సీతారామయ్య చెప్పారు. ఇప్పటికే గ్రామస్తులతో మాట్లాడినట్లు తెలిపారు. అత్యవసరమైతే పడవను ఉపయోగించుకునే వీలు కల్పించినట్లు చెప్పారు. శివసాగర్, మంచినీళ్లపేట, కొత్తపేట, తోటూరు తీర ప్రాంతాలను పరిశీలించామన్నారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లవద్దని గ్రామాలలో దండోరా వేయించామన్నారు.

ఉపాధి బకాయిల చెల్లింపునకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా 2014-19 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు కూటమి ప్రభుత్వం బకాయిల చెల్లింపునకు అవకాశం కల్పించిందని, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. సోమవారం మబగాంలోని క్యాంప్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్, పీఆర్ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులను ఆదుకోండి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

టెక్కలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ధ్రువపత్రాల వెరిఫికేషన్ సక్రమంగా జరగడం లేదని, అర్హులైన దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. మరోసారి వెరిఫికేషన్ చేసి న్యాయం చేయాలని, దివ్యాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఆయనతో పాటు చంద్రశేఖర్, మోహనరావులు ఉన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌సెల్‌లో 36 అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. వ్యవసాయ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆరోగ్య, మండల ప రిషత్, రెవెన్యూ శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించినట్టు తెలిపారు.

రేపు బీజేపీ అధ్యక్షుడు మాధవ్ రాక

నరసన్నపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఈనెల 20న జిల్లాలో పర్యటించనున్నారని... జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమానికి శ్రేణులంతా హాజరు కావాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు కోరారు. సోమవారం ఉర్లాం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు వీలుగా కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు మాధవ్ వస్తున్నారని వివరించారు.

బీమాతో ప్రజలకు ఆర్థిక భరోసా

పోలాకి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా తెరిచి..బీమా ప్రీమియం చెల్లిస్తే కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని సీజీఎం (ముంబాయి) డి.మేరీ సగాయా అన్నారు. సోమవారం ఈదులవలసలో ఖాతాదారులు, డిపాజిట్‌దారులు, ప్రజాప్రతినిధులు, స్వయంశక్తి, రైతుసంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎస్.బి.ఐ.చీఫ్ మేనేజర్ డి.మధుసూదనరావు, డీజీఎం రాహుల్ శంకర్, రీజనల్ మేనేజర్ సీహెచ్.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

30లోగా ప్రీమియం చెల్లించాలి

నరసన్నపేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలోగల రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈనెల 30లోగా బీమా ప్రీమియం చెల్లించాలని సంఘ అధ్యక్షులు ఇసా అప్పారావు, సీఈవో ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులందరూ వన్‌బీ, ఆధార్ కార్డుతో పాట ఎకరాకు రూ.170 వంతున ప్రీమియం చెల్లించాలని సూచించారు.

ఐటీడీఏ పీవోను కొనసాగించవద్దు


ఆందోళన చేస్తున్న గిరిజన ఐక్యవేదిక నాయకులు

టెక్కలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పీవోగా ఉన్న యశ్వంత్ కుమార్‌రెడ్డిని కొనసాగించవద్దని గిరిజన ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం గిరిజన ఐక్యవేదిక నాయకులు చౌదరి లక్ష్మీ నారాయణ, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి కొచ్చ శ్రీను, జిల్లా ఎస్టీ సెల్ విజిలెన్స్ కమిటీ సభ్యులు గేదెల రమణమూర్తి తదితరులు మాట్లాడుతూ గిరిజన భవనాలను గిరిజన సంఘాలకు అప్పగించక పోస్టుమెట్రిక్ హాస్టల్ కొనసాగిస్తున్నారని అన్నారు. దీనిపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. గిరిజన అభివృద్ధి, సంక్షేమంపై పీవో వివక్ష చూపుతున్నారని, ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వారు తెలిపారు.

విచారణ నివేదికను బహిర్గతం చేయండి


మాట్లాడుతున్న మోహన్‌రావు

మందస, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మందస మండలం పట్టులోగాం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విచారణ వివరాలను ఐటీడీఏ అధికారులు బహిర్గతం చేయాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మందస అంబేడ్కర్ విజ్ఞాన మందిరం వద్ద సోమవారం దళిత, ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కోత ధర్మారావు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య మాట్లాడుతూ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం సీహెచ్.రాజేశ్వరి పైన విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఫిర్యాదులు చేయకపోయినా బుడంబో ఆశ్రమ పాఠశాలకు డెప్యూటేషన్ వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యార్థులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఉద్యమిస్తే.. నిజాయతీగా పని చేసిన హెచ్ఎం రాజేశ్వరిపై చర్యలు తీసుకున్న ఐటీడీఏ అధికారుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థుల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘర్షణకు కారణమైన డీడీ, ఎటీడబ్ల్యుఏవోలపై విచారణ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత నాయకులు మోహన్‌రావు, తులసీదాస్, ఇప్పిలి చంద్రశేఖర్, కె.వరలక్ష్మి, వాసుదేవు, గేదెల సహదేవ్, జానకి, శంకర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చినందుకు సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే గోవిందరావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకురాళ్లు స్వర్ణలత, లక్ష్మి, పద్మ ప్రభ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

మందస, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి జిల్లా స్థాయి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిసోర్స్‌పర్సన్ ఉదయభాస్కర్, ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుమలరావు అన్నారు. మందస మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆదికర్మయోగి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సీతారామ్, హెచ్ఎంలు శ్రీధర్‌పాత్రో, తిరుపతిరావు, ఎస్‌వీ ప్రసాదరావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యునిగా కిరణ్ కుమార్


డాక్టర్ కిరణ్ కుమార్

కోటబొమ్మాళి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జోన్ ఉత్తమ పాడిపరిశ్రమ శస్త్ర చికిత్స వైద్యునిగా కురుడు పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ ఎంపిక య్యారు. ఈమేరకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 20న అమరావతిలోగల రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అవార్డులు అందజేస్తారు. ఆయన ఎంపిక పట్ల కోటబొమ్మాళి పశువైద్య సహాయ సంచాలకులు మంద లోకనాథం హర్షం వ్యక్తం చేశారు.